సాక్షి అనంతపురం

సోమవారం ၊ 1 ၊ ఏప్రిల్ ၊ 2024



యాప్‌లే బ్రహ్మాస్త్రాలు

పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ ఆధునిక సాంకేతికతతో కూడిన యాప్‌లు ప్రవేశపెట్టింది. 8లో



అక్రమాలకు ముకుతాడు

ఎన్నికల కోడ్‌ను అధికారులు కఠినంగా అమలు చేస్తున్నారు. అక్రమాలకు చెక్ పెడుతున్నారు. 8లో

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.33	సెహరీ : 4.58



న్యూస్‌రీల్

'గురుకులాల' దరఖాస్తు గడువు పొడిగింపు



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ఏపీ గురుకుల పాఠశాలల్లో (గుత్తి బాలికలు, నూతిమడుగు బాలురు) 5 తరగతి, 6,7,8 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లు, గురుకుల కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి, నాగార్జునసాగర్‌లోని డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు పొడిగించారు. వాస్తవానికి ఆదివారం నాటికి గడువు ముగిసింది. ఈనెల 5 వరకు పొడిగించినట్లు జిల్లా ఏపీఆర్ఎస్,జేసీ,డీసీ కోఆర్డినేటర్ జీపీ విజయలత ఓ ప్రకటనలో తెలియజేశారు. ఏప్రిల్ 25న రాత పరీక్ష ఉంటుందని వెల్లడించారు. https://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. గార్లదిన్నె మైనార్టీ బాలుర పాఠశాలలో నేరుగా అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజయలత కోరారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



అనంతపురం ఎస్‌ఐయూ చర్చిలో వాక్య పరిచర్య చేస్తున్న రెవరెండ్ సంపత్‌కుమార్

అనంతపురం కల్చరల్: ఈస్టర్ వేడుకలను జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతపురం నగరంలోని చర్చిల వద్ద సందడి నెలకొంది. సప్తగిరి సర్కిల్‌లోని ఎస్‌ఐయూ చర్చి, అరవిందనగర్ సీఎస్‌ఐ చర్చి, కళాకారుల కాలనీలోని రెమో చర్చి, రుద్రంపేట బైపాస్ వద్ద ఇక్తూస్ చర్చి, కోర్టు రోడ్డులోని గాస్పెల్‌హాల్ కిటకిటలాడాయి. ఈ సందర్భంగా పాస్టర్లు రెవరెండ్ బెనహర్‌బాబు, రెవరెండ్ సంపత్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. మానవులను పరిశుద్ధాత్ములుగా మార్చడానికే యేసు పునరుత్థానము పొందారన్నారు. ఆయన పునరుత్థానము లోకానికి శుభకరమన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి నిదర్శనమన్నారు. అనంతరం భక్తి గీతాలతో రోయర్ బృందాలు ఆకట్టుకున్నాయి. ఈస్టర్ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

అభిమాన వీచిక.. విజయ సూచిక

"మేం ఈరోజు ఉన్నత చదువులు చదువుతున్నామంటే అది జగన్ చలువే. ప్రతి ఒక్కరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందింది. రూ.20 లక్షలు ఖర్చు చేస్తే గానీ ఇంజినీరింగ్ విద్య పూర్తి కాదు. అలాంటిది జగన్ చేయూతతో వందలాది మంది ఉచితంగా చదువుకుంటున్నాం. అలాంటి వ్యక్తి స్వయంగా మా ప్రాంతానికి వచ్చినప్పుడు స్వాగతం పలకకపోతే ఎలా?"

– గుత్తి శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

"మమ్మల్ని ఎవరూ ఇక్కడికి రావాలని పిలవలేదు. జగన్‌పై అభిమానంతో వచ్చాం. ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఎంతో లబ్ధి పొందాం. అలాంటి మంచి వ్యక్తిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. అండగా ఉంటామని చెప్పాల్సిన ఆవశ్యకత కూడా ఉంది. జగన్ రాత్రి 12 గంటలకు వచ్చినా ఇక్కడే ఉండి ఆయన్ను పలకరించి వెళ్తాం"

– గుంతకల్లు నియోజకవర్గం పొగరూరువాసి జయరామిరెడ్డి

"నాకు జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఎంతో అభిమానం. ఆయనను చూసేందుకు ఇంతకంటే ఎక్కువ ఎండ తీవ్రత ఉన్నా వస్తా. మాకు వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎవరన్నది ముఖ్యం కాదు. మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాలనేదే సంకల్పం.

– గుత్తి మండలం రజాపురం గ్రామానికి చెందిన పాండురంగ రాజు

ఒకరేమిటి.. ఎందరిని అడిగినా ఇలాంటి సమాధానాలే. రెండు రోజుల క్రితం గుత్తి నుంచి రాప్తాడు వరకూ సీఎం జగన్ నిర్వహించిన రోడ్ షోలో దారి పొడవునా కనిపించిన జనసంద్రంలో ఎవరి నోట విన్నా 'మా అభిమాన నేత వస్తున్నారు, ఆయన్ను చూశాకే ఇక్కడి నుంచి కదులుతాం.' అనే మాటే.



శనివారం గుత్తిలో నిర్వహించిన బస్సు యాత్రలో అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న సీఎం జగన్

- సీఎం జగన్‌ను అక్కున చేర్చుకున్న జిల్లా ప్రజానీకం
- రాత్రి 10 గంటలు దాటినా జన నేతను పలకరించాకే ఇంటికి
- 75 కిలోమీటర్ల బస్సు యాత్రకు 8 గంటల సమయం
- జగన్ అంటే జనం.. జనం అంటే జగన్ అని మరోసారి నిరూపితం
- వైఎస్సార్ సీపీ జయకేతనం ఖాయమని సంకేతాలిచ్చారంటోన్న రాజకీయ విశ్లేషకులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మండే ఎండను సైతం లెక్కచేయకుండా ఐదారు గంటలు నిలబడిన వారు.. తమ అభిమాన నేతను చూడగానే ఆ కష్టాన్ని ఒక్క నిమిషంలోనే మర్చిపోయారు. ఇంత గొప్ప అభిమానం దేనికి సంకేతం?, రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీకి దోహదం చేస్తుందా? అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఓవైపు ప్రతిపక్ష నాయకులు డబ్బు, మద్యం వెదజల్లుతూ వాహనాలు పెట్టి జనాన్ని తెచ్చినా పట్టుమని పది నిమిషాలు నిలబడకుండా వెళ్లిపోతున్న పరిస్థితి చూస్తున్నాం. కానీ ఎండను కాదని, ఆకలిని తట్టుకుని, సహనాన్ని ప్రోది చేసుకుని గంటల తరబడి వేచి ఉండి జగన్‌ను చూడ్డానికి వస్తున్న పరిస్థితులు చూస్తే నలభై ఏళ్ల ఇండస్ట్రీకి గట్టి దెబ్బ పడనున్నట్టు తెలుస్తోంది. అభిమానుల వెల్లువ చూస్తే మళ్లీ 2019 ఎన్నికల ఫలితాలు పునరావృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

కదిలొచ్చిన మహిళా లోకం..

సీఎం జగన్ రోడ్‌షో గుత్తి నుంచి బుక్కరాయసముద్రం మండలం వడియంపేట గ్రామం మీదుగా సాగింది. సీఎంను చూసేందుకు ఆ గ్రామానికి చెందిన మహిళలందరూ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన డివైడర్‌పై సాయంత్రం 5 నుంచి రాత్రి 8:30 గంటల వరకూ కూర్చొనే ఉన్నారు. ఈ క్రమంలోనే వారిని 'సాక్షి' పలకరించగా.. 'మేమంతా ఈ ప్రభుత్వంలో లబ్ధిదారులమే. ఎన్ని గంటలైనా జగన్‌ను చూశాకే ఇంటికెళతాం..త్వరలో ఆయన రుణం తీర్చుకుంటాం' అంటూ సంతోషంగా తమ అభిప్రాయం వెలిబుచ్చారు. రాత్రి 9 గంటల సమయంలో జగన్ అక్కడికి రాగానే మహిళలందరూ పూలు చల్లి ఆయనపై అభిమానం చాటుకున్నారు. ఇక జగన్ రోడ్ షో రాప్తాడు చేరేందుకు రాత్రి 10.30 గంటలు దాటింది. అప్పటికీ అక్కడ కూడా చాలామంది మహిళలు ఆయన కోసం వేచి ఉన్నారు. అభిమాన నేతను చూసి ఉప్పొంగిపోయారు. జిల్లాలో 75 కిలోమీటర్ల బస్సు యాత్రకు 8 గంటలు పట్టిందంటేనే జనాభిమానం ఎంతలా ఎగిసిపడిందో చెప్పవచ్చు.

చంద్రబాబు కుయుక్తులతో పింఛన్‌దారులకు ఇబ్బందులు



మాట్లాడుతున్న శంకర్‌నారాయణ

గార్లదిన్నె: చంద్రబాబు పన్నిన కుయుక్తుల కారణంగానే సంక్షేమ పథకాల పంపిణీ నుంచి వలంటీర్లను దూరం పెడుతూ ఎన్నికల కమిషన్ (ఈసీ) నిర్ణయం తీసుకుందని, దీంతో పింఛన్‌దారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకర్ నారాయణ అన్నారు. మండలంలోని ముకుందాపురంలో ఆదివారం పార్టీ శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు, చేనేతలకు పింఛన్ సొమ్ము అందేదన్నారు. పింఛన్‌దారుల సంతోషాన్ని ఓర్వలేని చంద్రబాబు తన అనుంగు శిష్యుడైన నిమ్మగడ్డ రమేష్‌తో కలిసి కుట్రలకు తెరలేపారన్నారు. ఈ క్రమంలోనే వలంటీర్లపై ఈసీ నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. పింఛన్‌దారులను దృష్టిలో ఉంచుకుని తన నిర్ణయంపై ఎన్నికల కమిషన్ పునఃసమీక్షించాలని విజ్ఞప్తి చేశారు.శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు మాట్లాడుతూ ఈసీ నిర్ణయంతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇబ్బంది పడతారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ అందజేస్తుంటే ప్రతిపక్ష పార్టీ నాయకులు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే టీడీపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజనేయులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరేంద్ర రెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, పాలిఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ పరంధామ, ముకుందాపురం సర్పంచు హిమకుమారి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

- నేటి మధ్యాహ్నం నుంచి ఆలయం మూత
- రెండో తేదీ యథావిధిగా లక్ష్మీనారసింహుడి దర్శనం

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి తీర్థవాది ఉత్సవం సోమవారం భృగుతీర్థంలో భక్తుల కోలాహలం మధ్య జరగనుంది.ఉదయం ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవిల సమేతంగా స్వామి వారు వసంతోత్సవాలు జరుపుకుంటారు. అనంతరం శ్రీదేవి, భూదేవిలతో కలిసి శ్రీవారు భృగుతీర్థంలోకి వెళ్లి అక్కడ చక్ర స్నానం ఆచరిస్తారు. అనంతరం విశేషాలంకరణతో తిరువీధుల గుండా తిరిగి ఆలయం చేరుకుంటారు.

నేడు ధ్వజావరోహణం..

బ్రహ్మోత్సవాల ప్రారంభం (మార్చి 19) నాడు ఆలయం ముందు ధ్వజ స్తంభానికి కట్టిన కంకణాలు సోమవారం విప్పేస్తారు. అంటే ధ్వజావరోహణం గావిస్తారు. దీంతో తీర్థవాది ఉత్సవం ముగుస్తుంది. అనంతరం శ్రీవారు మధ్యాహ్నం రెండు గంటలకు ఆలయంలోకి ప్రవేశిస్తారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి స్వామి వారు యాగశాలలోనే గడిపారు. నేటి మధ్యాహ్నం 2 గంటలకు ఆలయం తలుపులు మూసివేస్తారు. అప్పటి నుంచి ఒక రోజంతా శ్రీవారి దర్శనం ఉండదు. తిరిగి మంగళవారం (రెండో తేదీ) ఉదయం నుంచి స్వామివారు ఆలయంలో యథావిధిగా తన భక్తులకు దర్శనమిస్తారు. అదే రోజు రాత్రి ఆలయ ప్రాంగణంలో పుష్పయాగోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



విద్యుద్దీపాలంకరణలో ఆలయ నాలుగు గోపురాలు

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

- జిల్లాకు చేరిన 1.80 లక్షల జవాబుపత్రాలు
- 58 ఏళ్లు నిండిన టీచర్లకు మినహాయింపు
- కేఎస్‌ఆర్ స్కూల్‌లోని 'క్యాంపు'లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికారులు



మూల్యాంకన కేంద్రం ఇదే

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 8 వరకు మూల్యాంకనం జరుగుతుంది. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారులు స్థానిక కేఎస్‌ఆర్ బాలికల పాఠశాలలోని 'క్యాంపు'లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 1.80 లక్షల జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయి. వాటిని స్ట్రాంగు రూంలో భద్రపరిచారు. మూల్యాంకనానికి 650 మందిని ఏఈ (అసిస్టెంట్ ఎగ్జామినర్లు)గా నియమించారు. 250 మందిని సీఈ (చీఫ్ ఎగ్జామినర్)లుగా నియమించారు. 200 మందిని స్పెషల్ అసిస్టెంట్లుగా తీసుకున్నారు. ఎనిమిది మంది అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లను నియమించారు. డెప్యూటీ క్యాంపు ఆఫీసర్ (అడ్మిన్)గా డీవైఈఓ శ్రీదేవి వ్యవహరిస్తారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ డెప్యూటీ క్యాంపు ఆఫీసర్ (స్ట్రాంగ్‌రూం)గా వ్యవహరిస్తారు. జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ క్యాంపు ఆఫీసర్‌గా ఉంటారు. ఆర్జేడీ రాఘవరెడ్డి పరిశీలకులుగా వ్యవహరిస్తారు. ఉదయం 9 గంటలకు క్యాంపు ప్రారంభమవుతుందని అందరూ విధిగా వచ్చి రిపోర్ట్ చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మీ సూచించారు.

58 ఏళ్లకు పైబడిన వారికి మినహాయింపు..

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) విధులకు 58 ఏళ్లకు పైబడిన టీచర్లకు మినహాయింపు ఇచ్చారు. పేపర్లు దిద్దేందుకు ఎవరికైనా ఆసక్తి ఉంటే వారిని విధులకు తీసుకుంటారు. తీవ్ర అనారోగ్య సమస్యలున్న వారికి మినహాయింపు ఇచ్చారు. ఎవరికై నా అనారోగ్య సమస్య ఉండి ఇబ్బందిగా ఉంటే సంబంధిత సర్టిఫికెట్లు చూపిస్తే మినహాయింపు ఇస్తామని అధికారులు చెబుతున్నారు.

పూర్తి స్థాయిలో వసతులు..

ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని క్యాంపులో అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా చల్లని తాగునీరు, ఫ్యాన్లు, లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఎక్కువమంది విధుల్లో ఉంటుండడంతో మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.

గుంతకల్లు 'గుమ్మ'మెక్కేనా..?

చుక్కలు చూపుతామని సొంత పార్టీ నేతలే హెచ్చరించారు. రకరకాలుగా ప్రలోభాలకు గురిచేసినా లొంగనంటున్నారు. తన మనస్తత్వం తెలిసిన ప్రజలు కూడా బహిరంగంగానే బయటకు వచ్చి అసంతృప్తి వ్యక్తం చేశారు. టికెట్ కేటాయించిన నియోజకవర్గంలో అడుగడుగునా గుమ్మనూరు జయరామ్‌కు అసమ్మతి స్వాగతం పలుకుతోంది.

- ఇంకా గుంతకల్లు వైపు పూర్తిస్థాయిలో చూడని గుమ్మనూరు జయరామ్
- అడుగడుగునా రగులుతున్న అసమ్మతి జ్వాలలు
- బొమ్మ చూపిస్తామని బహిరంగంగానే హెచ్చరించిన తెలుగు తమ్ముళ్లు



గుమ్మనూరు జయరామ్

గుంతకల్లు: ఎడతెగని చర్చలు, అనేక సమాలోచనల అనంతరం గుంతకల్లు నియోజకవర్గ టీడీపీ టికెట్ దక్కించుకున్న గుమ్మనూరు జయరామ్‌కు ఆదిలోనే హంసపాదు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది. సీనియారిటీ, పార్టీ విధేయతను పక్కన పెట్టి జయరామ్‌కు సీటు కట్టబెట్టడాన్ని తెలుగు తమ్ముళ్లు ఓర్వలేకపోతున్నారు. పార్టీ టిక్కెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్‌తోపాటు వారి కుటుంబసభ్యులు, వర్గీయులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. జయరామ్‌ను ఓడిస్తామని ఇప్పటికే బాహాటంగానే ప్రకటించారు. జయరామ్ విషయంలో తమ అసంతృప్తిని స్పష్టంగా వ్యక్తపరిచినా చంద్రబాబు ఆయన వైపే మొగ్గు చూపడంపై జితేంద్రగౌడ్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. అయితే, చంద్రబాబుపై గౌరవంతో ఆయన నిర్ణయానికి తలవంచి సర్దుకుపోతాడా లేదా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతాడా అనేది కూడా ఆసక్తికరంగా మారింది.

దారికి రాని కేడర్..

మరోవైపు గుమ్మనూరు జయరామ్ శిబిరంలో ఉన్న కొందరు తెలుగుదేశం నాయకులు, ఆయన కుటుంబసభ్యులు కొన్ని రోజులుగా స్థానిక తెలుగు తమ్ముళ్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. రకరకాల తాయిలాలతో కేడర్‌ను తమ వైపు తిప్పుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే నిన్నటిదాకా గుమ్మనూరు అభ్యర్థిత్వానికి వ్యతిరేకంగా రోడ్డుపైకి వచ్చి నిరసనలు తెలిపిన తాము, ఆయన కోసం ఎలా పని చేస్తామని తెలుగుతమ్ముళ్లు చాలాచోట్ల తెగేసి చెబుతున్నట్లు తెలుస్తోంది.

ప్రజల్లోనూ భయం..

గుమ్మనూరు జయరామ్ అభ్యర్థిత్వం పట్ల స్థానిక ప్రజలు కూడా అసహనంగా ఉన్నారు. రౌడీయిజం, మాఫియాకు మారుపేరుగా చెప్పుకునే గుమ్మనూరు జయరామ్, ఆయన అనుచరులు.. ప్రశాంతమైన గుంతకల్లు నియోజకవర్గంలో ఎక్కడ అలజడులు రేపుతారోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గుమ్మనూరు జయరామ్ చరిత్ర తెలిసిన వారైతే మరింతగా హడలిపోతున్నారు. జయరామ్ పేకాట మాఫియా, భూ కబ్జాలు, ఆయన అనుచరుల ఆగడాలను తలుచుకుంటూ భయకంపితులవుతున్నారు. ఈ క్రమంలోనే తెలుగు తమ్ముళ్లతో పాటు ముస్లిం, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, కురుబ, యాదవ తదితర అనేక సామాజిక వర్గ నాయకులతో పాటు పట్టణ వ్యాపారులు ఏకంగా విలేకరుల సమావేశాలు పెట్టి జయరామ్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకరించారు. రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు.

గెలుపు ఎట్లా..?

గుంతకల్లులో పూర్తి స్థాయిలో అడుగుపెట్టకముందే సొంత కార్యకర్తలు, ప్రజల్లో జయరామ్ పూర్తి వ్యతిరేకత మూట కట్టుకున్నారు. ఈ క్రమంలో టీడీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలను తన వైపు తిప్పుకోవడం, జితేంద్రగౌడ్ వర్గం సహకారం పొందడం, జనంలోకి వెళ్లడం కత్తిమీద సాములా మారనుంది. ఇదే ఇప్పుడు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. తెలుగు తమ్ముళ్లు వ్యతిరేకిస్తున్నా జయరామ్‌కే చంద్రబాబు టికెట్ కేటాయించడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్లు చేతులు మారడంతోనే బాబు ఆయన వైపు మొగ్గు చూపారని బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

జనమంతా జగన్ వెంటే

- 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రతో మరోసారి నిరూపితం
- జిల్లాలో వైఎస్సార్ సీపీ విజయదుందుభి ఖాయం
- చంద్రబాబు, లోకేష్‌కు చివరికి రెడ్‌బుక్స్ మాత్రమే మిగులుతాయి
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: 'జనమంతా జగన్ వెంటే ఉన్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రతో మరోసారి ఈ విషయం నిరూపితమైంది' అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం అనంతపురం నగర శివారులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రి ఒంటి గంటయినా జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు జనం రోడ్లపై ఎదురు చూస్తున్నారంటే ఆయనపై వారికెంత అభిమానముందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇప్పటిదాకా బస్సు యాత్ర సాగిన వైఎస్సార్, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో విశేష స్పందన లభించిందని, వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు తామంతా సంసిద్ధంగా ఉన్నట్లు ప్రజలు స్పష్టం చేశారన్నారు. ఈ ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రెడ్‌బుక్‌లో టీడీపీ నాయకుల పేర్లే..

చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌కు చివరికి రెడ్‌బుక్స్ మాత్రమే మిగులుతాయని ప్రకాష్ రెడ్డి ఎద్దేవా చేశారు. చంద్రబాబు అప్రజాస్వామిక విధానాలు, టికెట్ల కేటాయింపులో ఆయన సాగించిన దోపిడీతో ప్రజల్లో మరింత చులకనయ్యారన్నారు. ఆయన పెద్ద మోసగాడు అనే స్పష్టత ప్రజలకు ఉందన్నారు. లోకేష్ ప్రతిచోటా రెడ్‌బుక్‌లో అధికార పార్టీ నాయకుల పేర్లు రాసుకున్నానంటూ చెప్పారని, వాస్తవంగా చూస్తే టీడీపీకి చెందిన ఏయే నాయకులను టికెట్లు ఇవ్వకుండా పక్కన పెట్టాలోనని ఆలోచించి వారి పేర్లు రాసుకున్నట్లున్నారని విమర్శించారు. జిల్లాలో ప్రభాకర్‌చౌదరి, ఉమా మహేశ్వరనాయుడు, జితేంద్రగౌడు, పరిటాల శ్రీరామ్, నిమ్మల కిష్టప్ప పేర్లు రెడ్‌బుక్‌లో రాసినట్లు స్పష్టమవుతోందన్నారు.

ప్రజలను రెచ్చగొట్టి లబ్ధి పొందే యత్నం..

చంద్రబాబు ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు ఉన్నా, పరిటాల కుటుంబ సభ్యులు 25 ఏళ్ల పాటు మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా కొనసాగినా రాప్తాడు నియోజకవర్గంలో చేయలేని అభివృద్ధిని తాము చేసి చూపించామని ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే ఈ అభివృద్ధిని కొనసాగిస్తామని చెప్పుకోవడం తప్ప వేరే గత్యంతరం వారికి లేదన్నారు. 3 వేలమందిపై తాను కేసులు పెట్టించానని పరిటాల సునీత ఆరోపిస్తున్నారని, మూడు కేసులు అక్రమంగా పెట్టినట్లు ఉంటే చూపించాలని నిలదీశారు. కేవలం ప్రజలను రెచ్చగొట్టి, వర్గాలుగా విభజించి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సునీత కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. అధికారంలోకి వస్తే వలంటీర్ల సంగతి తేల్చుతాం, వైఎస్సార్‌సీపీ నాయకులను ఊళ్లొదిలిస్తాం, చీమలను నలిపినట్లు నలిపేస్తాం, కాళ్లు చేతులు విరగ్గొడతాం, దాడులు చేస్తాం అంటూ పల్లెల్లో ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. 'నువ్వు, మీ ఆయన అధికారంలో ఉన్న 25 ఏళ్లలో ఏమి సాధించారు? ఎంతసేపూ ప్రజలను వర్గాలుగా విభజించి విడిపోయిన వర్గంతో ఓట్లు వేయించుకున్నారు. మళ్లీ ఆ పాత సంప్రదాయాన్ని అమలు చేయాలని చూస్తున్నారు' అంటూ సునీతపై మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వారే మరోసారి గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయయాదవ్, కనగానపల్లి జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, రామగిరి మండల కన్వీనర్ క్రాహనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

అనంతపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర సోమవారం నుంచి శ్రీసత్యసాయి జిల్లాలో కొనసాగనుంది. ఈ క్రమంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు డీఐజీ ఆర్‌ఎస్ అమ్మిరెడ్డి వెల్లడించారు. శనివారం అనంతపురం జిల్లాలోకి ప్రవేశించిన బస్సు యాత్ర మొత్తం 75 కిలోమీటర్ల మేర సాగింది. లక్షలాది మంది ప్రజలు సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చారు. 44వ జాతీయ రహదారి పొడుగునా సీఎం వైఎస్ జగన్‌కు జనం నీరాజనం పలికారు. అంచనాలకు మించి జనం తరలిరావడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లాలో ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన ప్రదేశాల్లో సక్రమంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి డీఐజీ ఆర్‌ఎస్ అమ్మిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

టీబీ డ్యాంలో 4.8 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్: కర్ణాటకలోని తుంగభద్ర రిజర్వాయర్‌లో నీటిమట్టం అడుగంటుతోంది. టీబీ బోర్డు అధికారులు ఇప్పటికే పలు కాలువలకు నీటి సరఫరాను నిలిపివేశారు. డెడ్‌స్టోరేజీకి పడిపోతుండడంతో ప్రస్తుతమున్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకే పరిమితం చేశారు. టీబీ డ్యాం పూర్తి సామర్థ్యం 1,633 అడుగులు కాగా ఆదివారం నాటికి 1580.67 అడుగులకు చేరుకుంది. మొత్తం 105.788 టీఎంసీలకు గాను 4.810 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 8,070 టీఎంసీల వరకు నీరు ఉండేది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో పూర్తిగా లేదు. అవుట్‌ఫ్లో రూపంలో ఎల్‌ఎల్‌సీకి 730, జిందాల్‌కు 35, రాయబసవన కాలువకు 220 క్యూసెక్కులు కలిపి మొత్తం 975 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఐదుగురి సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన ముగ్గురు వలంటీర్లు, ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎం.గౌతమి సస్పెండ్ చేశారు. సస్పెండ్ అయిన వారిలో విడపనకల్లు మండలం హవళిగి గ్రామ వలంటీర్ కొల్లారప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ కె.మల్లికార్జున, అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామ వలంటీర్లు ప్రవీణ్, ప్రకాష్, తాడిపత్రి మండలం ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ పావురాల శీనయ్య ఉన్నారు.

యాప్‌లే బ్రహ్మాస్త్రాలు

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట
- వివిధ రకాల యాప్‌లను అందుబాటులోకి తెచ్చిన ఎన్నికల కమిషన్
- ఫిర్యాదులకు వేగవంతమైన పరిష్కారం
- ఎన్నికల ఖర్చు, పోలింగ్ బూత్‌ల సమాచారం సులువుగా తెలుసుకునే సదుపాయం



సీ విజిల్



సువిధ యాప్ అబ్జర్వర్ యాప్ నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ కేవైసీ యాప్ ఓటరు హెల్ప్‌లైన్ యాప్ సాక్షం యాప్

బొమ్మనహాళ్: పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ ప్రతి సారీ కొత్త విధానాలు ప్రవేశపెడుతూ వస్తోంది. ఈ సారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నికల్లో రాజకీయ పార్టీల అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వివిధ రకాల యాప్‌లను రూపొందించి బ్రహ్మాస్త్రంలా మార్చి ప్రజల చేతికి అందజేసింది. ఎన్నికల నియమావళిని ఎక్కడ... ఎవరు ఉల్లంఘించిన నేరుగా ప్రజలే ఫిర్యాదు చేసేలా సీ విజిల్, సువిధ, కేవైసీ, అబ్జర్వర్, సాక్షం, ఓటరు హెల్ప్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ యాప్‌లను అందుబాటులోకి తీసుకోచ్చింది. ఎన్నికలకు సబంధిచిన సమాచారం, కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు, ఎన్నికల నియమావళి, ఓటర్లుకు అవసరమైన సాయం, ఎన్నికల ఖర్చు, పోలింగ్ బూత్‌ల వివరాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల సమాచారం తెలుసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి.

సువిధ యాప్..

ఎన్నికల సమయంలో అభ్యర్థులకు నామినేషన్ అనుమతి జారీ ప్రక్రియలో సహాయ పడేందుకు అభివృద్ధి చేసిన అప్లికేషన్ ఇది. సువిధ క్యాండిడేట్ యాప్‌ను ఉపయోగించేందుకు అభ్యర్థులు ముందుగా ఖాతాను రిజిస్ట్రేషన్ చేసుకుని తర్వాత లాగిన్ కావాలి. తర్వాత, అభ్యర్థులు తమ నామినేషన్ల అనుమతిని చూడవచ్చు. అలాగే ప్రచారానికి అవసరమైన అనుమతుల గురించి తెలుసుకోవచ్చు.

అబ్జర్వర్ యాప్..

ఎన్నికల కోడ్ దుర్వినియోగం, అక్రమాలకు సంబంధించిన కేసులను తెలుసుకునేందుకు పరిశీలకులకు ఉపయోగపడుతుంది. యాప్‌ను ఉపయోగించేందుకు పరిశీలకులు ముందుగా ఖాతాను సృష్టించి వారి కోడ్, పాస్‌వర్డ్‌తో సమాచారాన్ని అందించాలి. తమ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ స్టేషన్ల సంఖ్య, ఓటర్ల సంఖ్య, రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఉన్న ప్రదేశం వంటి సమాచారాన్ని యాక్సెస్ చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది.

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్..

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారించేందుకు ఈసీకి సాయం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఓటరు తమ మొబైల్ నంబర్‌ను ఉపయోగించి పోర్టల్‌లో ప్రొఫైల్‌ను నమోదు చేసుకోవచ్చు. ఇందులో ఓటరు తమ ఫిర్యాదును నేరుగా నమోదు చేయొచ్చు. ఓటరు ఫిర్యాదు చేసిన తర్వాత, అది వివరణ కోసం ఎన్నికల అధికారికి చేరుతుంది. ఎన్నికల అధికారి నిర్ణీత వ్యవధిలోపు స్పందించాలి. పోలింగ్ బూత్ స్థానాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఎన్నికల ఖర్చు, ఎన్నికల అక్రమాలు వాటికి సంబంధించి ఫిర్యాదులను సకాలంలో ఈ యాప్ పరిష్కరిస్తుంది. పౌరులు తమ ఫిర్యాదులు ఏ స్థాయిలో ఉన్నాయో ఈ యాప్ ద్వారా పరిశీలించుకోవచ్చు.

సీ విజిల్..

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై సాక్ష్యాలతో సహా ప్రజలే ఈ యాప్‌లో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. పార్టీలకు అతీతంగా ఎవరు ఉల్లంఘలనకు పాల్పడినా ఫిర్యాదు చేయవచ్చు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి దీన్ని డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. మీ ఫోన్ నంబర్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రసంగాలు, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం ఇలాంటి ఉల్లంఘనలపై సరైన ఆధారాలు అప్‌లోడ్ చేయాలి. యా

కేవైసీ యాప్..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలు, వారి నేర చరిత్రకు సంబంధించిన అంశాలు ఈ యాప్‌లో పొందుపరిచి ఉంటాయి. అభ్యర్థిపై క్రిమినల్ కేసుల వివరాలు, ఆ కేసుల స్థితి, నేరాల స్వభావం ఉంటాయి. నేర చరిత్ర ఉన్న అభ్యర్థులను గుర్తించేందుకు, వారికి ఓటు వేయకుండా ఉండేందుకు ఓటర్లకు ఈ యాప్ సహాయపడుతుంది.

ఓటరు హెల్ప్‌లైన్ యాప్..

ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా వివరాలు, ఎలక్టోరల్ రోల్‌లో మీ పేరును సెర్చ్ చేయడం, ఓటు వేసేందుకు అర్హత ఉందో.. లేదో తనిఖీ చేసుకునేందుకు ఈ యాప్ దోహదపడుతుంది. డిజిటల్ ఫొటో ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎన్నికలకు సంబంధించిన వార్తలు, అప్‌డేట్‌లు ఉంటాయి.

దివ్యాంగుల కోసం యాప్..

దివ్యాంగులకు అనుకూలంగా ఉండేలా సాక్షం యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలింగ్ రోజున వీల్ చైర్ కోసం రిక్వెస్ట్ చేయొచ్చు. పోలింగ్ స్టేషన్ తెలుసుకునేందుకు సాయం చేసేలా అనేక ఫీచర్లు ఇందులో ఉన్నాయి. దృష్టి లోపం ఉన్న దివ్యాంగులు వాయిస్ ద్వారా తమకు అవసరమైన సాయాన్ని పొందవచ్చు.

'మేనిఫెస్టో'కు మార్గదర్శకాలు

- రాజకీయ పార్టీలకు ఈసీ స్పష్టమైన సూచనలు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో తమ పార్టీ మేనిఫెస్టోని రాజకీయ పక్షాలు విడుదల చేయడం సర్వసాధారణం. అయితే మేనిఫెస్టోను రూపొందించే క్రమంలో రాజకీయ పార్టీలు అనుసరించాల్సిన మార్గదర్శకాలను ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా సూచించింది. ప్రధానంగా సుప్రీం కోర్టు తీర్పు మేరకు మేనిఫెస్టో ఉండాలని మార్గదర్శకాలు జారీ చేసింది.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు..

- రాజ్యాంగంలో పేర్కొన్న ఆదర్శాలను, సూత్రాలను ఉల్లంఘించేలా ఎలాంటి అంశాలను ఎన్నికల మేనిఫెస్టోలో ఉంచరాదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా మేనిఫెస్టో ఉండాలి.
- రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో ప్రభుత్వ విధానాలు ప్రజల కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేలా మేనిఫెస్టో ఉండవచ్చు. అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు సంబంధించిన హామీలను ఎన్నికల మేనిఫెస్టోలో ఉంచడంపై ఎలాంటి అభ్యంతరం లేదు కానీ, రాజకీయపార్టీలు ఎన్నికల ప్రక్రియలోని పారదర్శకతను అతిక్రమించేలా లేదా ఓటర్లపై ప్రభావం చూపేలా తమ మేనిఫెస్టోలో ఎలాంటి హామీలు ఇవ్వకూడదు.
- ఆయా స్థాయిల వారి కోసం అందించేవి, పరపతితో కూడిన హామీలవంటి వాటి పారదర్శకత కోసం ఎన్నికల మేనిఫెస్టోలో ఆయా హామీలను హేతుబద్ధంగా నిలబెట్టుకునేందుకు ఉన్నటువంటి మార్గాలను, వాటిని నెరవేర్చేందుకు కావాల్సిన ఆర్థిక వనరులు వంటి వాటిని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతిబింబించాలి. నేరవేర్చిన హామీల ద్వారా మాత్రమే ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని రాబట్టుకోవాలి.

దోపిడీ దొంగల వేటలో ప్రత్యేక బృందాలు



బాధిత రైతుతో మాట్లాడుతున్న డీఎస్పీ బి.శ్రీరాములు

కణేకల్లు: మండలంలోని కణేకల్లు క్రాస్‌లో రైతు తిప్పారెడ్డి ఇంట్లో దోపిడీకి పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలను రంగంలో దించినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీరాములు తెలిపారు. కణేకల్లు క్రాస్ శివారు ప్రాంతంలో తోటలో నివాసముంటున్న రైతు తిప్పారెడ్డి ఇంట్లో శనివారం రాత్రి 8గంటలకు దోపిడీ జరిగిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం రాయదుర్గం రూరల్ సీఐ జె.ప్రసాద్‌బాబు, కణేకల్లు ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలసి డీఎస్పీ ఘటన స్థలాన్ని పరిశీలించారు. స్నిఫ్పర్ డాగ్, క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. దోపిడీకి వచ్చిన వారి తీరును బాధిత రైతును అడిగి డీఎస్పీ తెలుసుకున్నారు. ఇద్దరు తెలుగు, మరో నలుగురు హిందీలో మాట్లాడినట్లు బాధితుడు వివరించాడు. గంట ముందు ఓ వ్యక్తి బైక్‌లో వచ్చి వెళ్లాడని, ఆ సమయంలో అత్యవసర పని కోసం వచ్చి వెనక్కి వెళ్లాడని తాను భావించినట్లుగా పేర్కొన్నారు. అయితే ఆ వ్యక్తే మరో ఐదు గురిని వెంట బెట్టుకు వచ్చి చంపేస్తామంటూ మారుణాయుధాలతో బెదిరించి దోపిడీ సాగించినట్లు తిప్పారెడ్డి, తల్లి శంకరమ్మ, భార్య శారద వివరించారు. పండ్ల తోటల్లో నివాసముంటున్న రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా డీఎస్పీ సూచించారు. ఘటన స్థలాన్ని సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చోరీలు, దోపిడీలు జరగకుండా తగిన చర్యలు తీసుకొంటామన్నారు. దోపిడీదారులను పట్టుకొనేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. తోటల్లో నివాసముంటున్న రైతులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

నేత్రపర్వం..శ్రీవారి అలుకోత్సవం



అలుకోత్సవ విశిష్టతను వివరిస్తున్న అర్చకులు

కదిరి: బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీ నరసింహస్వామి అలుకోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. అనంతరం స్వామి వారు అశ్వవాహనంపై తిరువీధుల్లో తన భక్తులకు దర్శనమిచ్చారు. చతురంగ బలాలలో అత్యంత ప్రధానమైనది అశ్వ బలం. కలియుగాంతంలో శ్రీవారు అశ్వ వాహనంపై వచ్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తారని చాటి చెప్పడం కోసమే నారసింహుడు అశ్వవాహనంపై ఊరేగుతారని వేద పండితులు వివరించారు. యాగశాలలో నిత్యహోమం గావించిన మీదట శ్రీవారు విశేషాలంకరణతో ఆలయానికి సమీపంలో ఉన్న సుద్దుల మండపం వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న భక్తులు 'శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి గోవిందా..గోవింద' నామస్మరణ చేశారు. ఆలయ సహాయ కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్చక పండితులు బ్రహ్మోత్సవాలు, అలుకోత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. అన్ని ఉత్సవాలకు ఉభయదారులుగా భక్తులు వ్యవహరిస్తే ఆనవాయితీ ప్రకారం అలుకోత్సవానికి ఆలయ సహాయ కమిషనర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

టీడీపీ ఎన్నికల ప్రచారంలో ఎల్‌టీ



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఈశ్వరనాయక్ (వృత్తంలోని వ్యక్తి)

వజ్రకరూరు: మండలంలోని ఎస్‌ఎస్‌పీ తండాలో రెండు రోజుల క్రితం ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు పయ్యావుల విజయసింహా టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఆ గ్రామానికి చెందిన ల్యాబ్ టెక్నిషియన్ (ఎల్‌టీ) ఈశ్వర్‌నాయక్ పాల్గొన్నాడు. ప్రస్తుతం ఆయన విడపనకల్లు మండలం పాల్తూరు పీహెచ్‌సీలో ఎల్‌టీ గా పనిచేస్తున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన పలువురు ఈశ్వర్‌నాయక్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.

అలరించిన సంగీత కచేరి



సంగీత కచేరి నిర్వహిస్తున్న అనంతపురం విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి ప్రేమ తత్వాన్ని కొనియాడుతూ సత్యసాయి విద్యాసంస్థల అనంతపురం క్యాంపస్ విద్యార్థులు ప్రేమకు ప్రేమతో పేరుతో నిర్వహించిన సంగీత కచేరి అలరించింది. సత్యసాయిపై తమకున్న భక్తిని చాటుతూ అనంతపురం క్యాంపస్ కళాశాల మహిళా విద్యార్థులు ఆలపించిన గీతాలు భక్తులను సమ్మోహన పరిచాయి. అనంతరం విద్యార్థులు సత్యసాయి మహాసమాధిని సందర్శించారు.

సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా : ఎస్పీ



అనంపతురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియా నిర్వాహకులు పాటించాల్సిన నియమాలు, నిబంధనలపై మార్గదర్శకాలను విడుదల చేశారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లలో ప్రజలను తప్పుదారి పట్టించే సమాచారాన్ని, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలను పోస్టు చేయరాదు. అలాంటి వాటిని ఫార్వర్డ్ కూడా చేయరాదు. ట్రోలింగ్, ఆన్‌లైన్ వేధింపులు, తప్పుడు వార్తల ప్రచారాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటారు. వివాదస్పద పోస్టులకు ఐటీ చట్టం, ఐపీసీ సెక్షన్ 153(ఏ) కింద మూడు నుంచి ఐదేళ్ల వరకూ జైలు శిక్ష పడే ప్రమాదం ఉంది. ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లకు పాల్పడిన వారికి 67 యాక్ట్ కింద 5 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారు. ఉద్దేశపూర్వకంగా ఓ మహిళను లక్ష్యంగా చేసుకుని వేధిస్తే నేరుగా గాని, సోషల్ మీడియా వేదికల ద్వారా గానీ అదే పనిగా సంప్రదించడం, వెంట పడడం, దూషించడం, అవమానించడం, వేధించడం వంటి అంశాలను తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. వీరిపై ఐపీసీ సెక్షన్ 354 కింద కేసు నమోదు చేస్తారు. ఐదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉంది. రెండు వర్గాల మధ్య విద్వేషాలకు దారితీసే సమాచారాన్ని వైరల్ చేసినా, ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభపెట్టినా, భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తినా వెంటనే 94407 96800కు ఫోన్ చేయాలని ఎస్పీ అన్బురాజన్ పిలుపునిచ్చారు.

సీయూఈటీ యూజీ దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీల్లో యూజీ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే సీయూఈటీ-యూజీ - 2024 దరఖాస్తు గడువు పొడిగించారు. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఆదివారంతో దరఖాస్తు గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈ నెల 5వ తేదీ రాత్రి 9:50 గంటల వరకూ పొడగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెలుగు సహా 13 భాషల్లో మే 15 నుంచి ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.

'నవోదయ' ఫలితాలు విడుదల

లేపాక్షి: నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు ఆదివారం సాయంత్రం విడుదలైనట్లు లేపాక్షి నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 8,857 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో 4,871 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. వీరిలో ప్రతిభ కనబరచిన 79 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

అక్రమాలకు ముకుతాడు

కఠినంగా ఎన్నికల కోడ్

- రూ.26.46 లక్షల నగదు సీజ్
- రూ.35.01 లక్షల విలువ చేసే 6,120 లీటర్ల మద్యం పట్టివేత
- 10,370 బ్యానర్లు, పోస్టర్ల తొలగింపు
- 231 సీ విజిల్ ఫిర్యాదులు పరిష్కారం
- 60 మంది సస్పెన్షన్, ఆరుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు



కర్ణాటక సరిహద్దు విడపనకల్లు చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

అరనంతపురం అర్బన్: ఎన్నికల కోడ్‌ను అధికారులు కఠినంగా అమలు చేస్తున్నారు. కోడ్ ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు.

నగదు, మద్యం సీజ్..

ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా సరిహద్దుల్లో 38 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. జిల్లాలోకి అక్రమంగా నగదు, మద్యం, సామాగ్రి, వస్తువులు రవాణ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ ఈనెల 16న విడుదల చేయగా.. వెనువెంటనే ఎన్నికల ప్రవర్తన నియామవళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమలులోకి వచ్చింది. ఈ క్రమంలోనే ఇప్పటి వరకూ ఆధారలు చూపని రూ.26,46,890 నగదు సీజ్ చేశారు. రూ.35,01,4611 విలువ చేసే 6,120.13 లీటర్లు మద్యం సీజ్ చేశారు.

బ్యానర్లు, పోస్టర్ల తొలగింపు..

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా జిల్లావ్యాప్తంగా రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్ల తొలగింపు పక్కాగా చేపడుతున్నారు. ఇప్పటి వరకు 7,174 పోస్టర్లు, 3,196 బ్యానర్లు తొలగించారు. 836 గోడలపై ఉన్న పార్టీల రాతలను తొలగించారు. జిల్లావ్యాప్తంగా 5,911 నాయకులు విగ్రహాలు, ఫొటోలపై వస్త్రం కప్పారు.

వేగంగా ఫిర్యాదుల పరిష్కారం..

కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుల స్వీకరణకు భారత ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా సీ విజిల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా ఇప్పటి వరకు 231 ఫిర్యాదులు అందాయి. ఇందులో అత్యధికంగా జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు 133 ఫిర్యాదులు రాగా, 98 నియోజకవర్గాల నుంచి అందాయి. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 100 నిమిషాల్లో విచారణ చేసి ఫిర్యాదులను పరిష్కరించారు.

60 మందిపై చర్యలు..

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించే ప్రభుత్వ సిబ్బందిపైనా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకూ 40 మంది వలంటీర్లు, ఏడుగురు డీలర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్ ఒకరు, 11 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, ఒక పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఆరుగురిపై నియమావళి ఉల్లంఘనకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

పకడ్బందీగా ఎంసీసీ అమలు



జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియామవళి (ఎంసీసీ-మోడల్ కోడ్ ఆఫ్ కండెక్ట్) పకడ్బందీగా అమలవుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి నగదు, మద్యం, వస్తువులు అక్రమ రవాణా అడ్డకట్టకు జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేశాము. ఇప్పటి వరకు ఆధారాలు చూపని రూ.26.46 లక్షలు సీజ్ చేశాం. అదే విధంగా రూ.35.01 లక్షలు విలువ చేసే మద్యం పట్టుకున్నాం. 'సీ విజిల్' యాప్ ద్వారా అందుతున్న ఫిర్యాదులను 100 నిమిషాల్లో విచారణ చేసి పరిష్కరిస్తున్నాం. నియమావళి ఉల్లంఘించిన 60 మందిని సస్పెండ్ చేశాం.

– ఎం.గౌతమి, జిల్లా ఎనికల అధికారి, కలెక్టర్

రాజ్య పురస్కార్ క్యాంప్ ప్రారంభం



శిబిరంలో పాల్గొన్న స్కౌట్ విద్యార్థులు

హిందూపురం టౌన్: బాలబాలికల్లో దేశ భక్తి, క్రమశిక్షణ పెంపొందించి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యమని ఆ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసే అత్యున్నత రాజ్య పురస్కార్ టెస్టింగ్ శిబిరాన్ని ఆదివారం హిందూపురం సమీపంలోని పూలకుంట ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు పాల్గొని పతాకావిష్కరణ చేసి, మాట్లాడారు. ఉమ్మడి జిల్లా నుంచి 80 మంది స్కౌట్ విద్యార్థులు శిబిరానికి హాజరయ్యారన్నారు. ఈ నెల 4వ తేదీ వరకూ ఈ శిబిరం ఉంటుందన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలను రాష్ట్ర గవర్నర్ అందజేస్తారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవమూర్తి, స్కౌట్ సెక్రటరీలు వెంకటరమణప్ప, గిరిధర్, బొమ్మయ్య, రాష్ట్ర పరిశీలకులు నాగరాజు గుప్తా, డీఓసీలు నాగరాజు, లక్ష్మన్న, వివిధ పాఠశాలల స్కౌట్ మాస్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న అంకే నరేష్ తదితరులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం అలుమూరు గ్రామానికి చెందిన అంకే నరేష్ టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా శనివారం గుత్తిలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో అంకే నరేష్ వైఎస్సార్‌సీపీలో చేరారు. నరేష్‌కు ముఖ్యమంత్రి జగన్ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆదివారం అంకే నరేష్ తదితరులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని సన్మానించారు. వచ్చే ఎన్నికల్లో రాప్తాడు నియోజకవర్గంలో ప్రకాష్ రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటామన్నారు.

సంతల ఆదాయం రూ.3.76 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో శని, ఆదివారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.76 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెల, పొట్టేళ్ల సంత నుంచి రూ.1.84 లక్షలు, పశువుల సంత నుంచి రూ. 1.92 లక్షలు ఆదాయం వచ్చినట్లు వివరించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామిని బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష నివారణ రాహు కేతు హోమాలు చేపట్టారు. ఆలయంలో మంజునాథ స్వామి, పార్వతి దేవికి పూజల అనంతరం మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్

అనంతపురం కార్పొరేషన్: నగర ప్రజల సౌకర్యార్థం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నీటి సరఫరా, పైప్ లైన్ లీకేజీలు, స్ట్రీట్ లైటింగ్, పారిశుద్ధ్యం, తదితర సమస్యలను 08554-274765, 230234 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సకాలంలో సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుంటారన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాలిసెట్‌కు నేటి నుంచి ఉచిత శిక్షణ

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులకు సోమవారం నుంచి పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. నారాయణ ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. వివరాలకు 9010222175, 9491781677 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'ప్లీశాంట్ వ్యాలీ' బ్రోచర్ల విడుదల


బ్రోచర్లు విడుదల చేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: నగరంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం మహతి గ్రూపు ఆధ్వర్యంలో కొత్త ప్రాజెక్ట్ 'ప్లీశాంట్ వ్యాలీ'కి సంబంధించిన బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మహతి గ్రూపు సంస్థల చైర్మన్ గణేశం ముత్యాలరెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ ప్రత్యేకతలను వివరించారు. 30 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాజెక్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాప్తాడు వద్ద జాతీయ రహదారి పక్కనే కొత్త ప్రాజెక్ట్ 'ప్లీశాంట్ వ్యాలీ', మండల పరిధిలోని ఎస్వీఐటీ సమీపంలో జాతీయ రహదారి పక్కన 15 ఎకరాల విస్తీర్ణంలో 'కొంట్రీ ప్రాజెక్ట్' అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులో రుద్రంపేట బైపాస్‌కు అతి దగ్గరగా 'జీఎంఆర్ కాలనీ' ప్రాజెక్ట్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ మూడు ప్రాజెక్ట్‌లూ అహుడా నుంచి ఆమోదం పొందాయని పేర్కొన్నారు.

వడ్డీ మాఫీ @ రూ.2.5 కోట్లు

- అసెస్‌మెంట్‌దారులకు భారీగా లబ్ధి
- పన్ను చెల్లించిన 5 వేల మంది అసెస్‌మెంట్‌దారులు
- 31 రోజుల్లో రూ.11 కోట్లకుపైగా ఆదాయం
- చివరి రోజు రూ.కోటికిపైగా వసూలు


నగరపాలక సంస్థలోని పన్ను చెల్లింపుల కేంద్రం

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఇంటి, ఖాళీ జాగా పన్ను చెల్లింపులపై ప్రకటించిన వడ్డీ మాఫీ అసెస్‌మెంట్‌దారులకు వరంగా మారింది. గతేడాది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కార్ వడ్డీ మాఫీ రాయితీ కల్పించింది. ఈ ఏడాది మార్చి 1 నుంచి ఆదివారం (మార్చి 31) వరకు వడ్డీ మాఫీని ప్రకటిస్తూ జీఓను విడుదల చేసింది. ఈ క్రమంలో నగరంలోని 74 సచివాలయాల పరిధిలో పన్ను వసూళ్లపై కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పర్యవేక్షణలో ఆర్ఓలు సతీష్, సుజాత, ఆర్ఐలు మురళీ, వేణు, బాబు, పద్మావతి, అడ్మిన్లు, అమినిటీలు నెల రోజుల పాటు ప్రత్యేక దృష్టి సారించారు.

లబ్ధిదారులకు మేలు

పన్ను వసూళ్లపై వడ్డీ మాఫీ ప్రభుత్వం ప్రకటించడంతో లబ్ధిదారులకు రూ.2.5 కోట్ల వడ్డీ మాఫీ అయ్యింది. ప్రభుత్వ ఆదాయానికి గండి పడ్డా.. లబ్ధిదారులకు మేలు చేకూర్చాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దాదాపుగా 5 వేల మందికి పైగా లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కమలానగర్‌లో ఓ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్వాహకుడు ఒకేసారి పను చెల్లించి రూ.5 లక్షల వరకూ రాయితీ పొందారు. ఇలా చాలా మంది రూ.లక్షల్లో రాయితీ పొందారు. సామాన్య మధ్య తరగతి ప్రజలు ఒకేసారి పన్ను చెల్లించి, వడ్డీ మాఫీ చేసుకున్నారు.

నీటి కనెక్షన్ తొలగింపు

పన్ను చెల్లించకుండా జాప్యం చేసిన ఓ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్వాహకుడిపై నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకుంది. ఇప్పటికే కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు సదరు అసెస్‌మెంట్‌దారుడికి నోటీసులు జారీ చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దీంతో ఆదివారం నగరపాలక సంస్థ సిబ్బంది సదరు షాపింగ్ కాంప్లెక్స్ నీటి కనెక్షన్ తొలగించారు.

చివరి రోజు జోరుగా చెల్లింపులు

వడ్డీ మాఫీ రాయితీ చివరి రోజు ఆదివారం రూ.కోటికిపైగా పన్ను వసూలైంది. అదనపు కమిషనర్ శ్రీహరిబాబు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులు, అడ్మిన్లు, తదితర సిబ్బందిని అప్రమత్తం చేశారు. మొండి బకాయిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పన్ను చెల్లించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా నగరపాలక సంస్థలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 5 కౌంటర్లలో రాత్రి 12 వరకూ పన్ను చెల్లింపులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నెలలో మొత్తం రూ.11 కోట్లకుపైగా ఇంటి, ఖాళీ జాగా పన్ను వసూలైంది.

నిస్సహాయురాలికి ఆపన్నహస్తం


కుట్టుమిషన్, ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం సెంట్రల్: పెద్దదిక్కు కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఓ నిస్సహాయురాలికి అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి ఆపన్నహస్తం అందించారు. వివరాలు.. నగరంలో 2వ రోడ్డులో నివాసముంటున్న వన్నూరప్ప, రాధ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కూలి పని చేసుకుంటూ జీవనం సాగించే వన్నూరప్ప 7 నెలల క్రితం ఆకస్మికంగా మృతి చెందాడు. కుటుంబ పెద్దదిక్కు చనిపోవడంతో కుటుంబం, పిల్లల పోషణ భారంగా మారింది. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాధ పరిస్థితిని తెలుసుకున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆదివారం పిల్లల చదువు, భవిష్యత్ అవసరాలకు రూ.1.50 లక్షలు నగదు బ్యాంకులో డిపాజిట్ చేయించారు. రాధకు టైలరింగ్‌లో నైపుణ్యం ఉండటంతో రూ.40 వేలు విలుజేసే కుట్టుమిషన్, 6 నెలలకు కావాల్సిన నిత్యావసర సరుకులు అందజేశారు. దీంతో ఆ కుటుంబం తరిమెల రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి

అనంతపురం కార్పొరేషన్: పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, సాయినగర్ ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్యం మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి వివరించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్యదర్శులు సమన్వయం చేసుకుని చెత్త తరలింపు పక్కాగా జరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా రోడ్డుపై చెత్త కన్పించకూడదని ఆదేశించారు. ఎప్పటికప్పుడు చెత్తను కంపోస్టుకు తరలించాలన్నారు. ప్రజలు సైతం చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా క్లాప్ ఆటోలు, పారిశుధ్య కార్యదర్శులకు అందించాలన్నారు. కార్యదర్శి వెంట ఏసీపీ మారుతీప్రసాద్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురుకు తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో ఆదివారం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో తండ్రి, కూతురుకు తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. కనగానపల్లి మండలం నర్సంపల్లికి చెందిన చాంద్‌బాషా తన కూతురు సానియాతో పని నిమిత్తం ధర్మవరానికి వచ్చారు. పని పూర్తి చేసుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా కాలేజీ సర్కిల్ వద్ద టూవీలర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీకూతురుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత వారిని అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీల అభ్యున్నతి


ఎన్నికల ప్రచారం చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: మైనార్టీల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింలకు అండగా నిలిచారని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. ఆదివారం స్థానిక కొవ్వూరు నగర్‌లోని నిమ్రా మసీదు సమీపంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. మేయర్ వసీం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియాజ్, తదితరులు మతపెద్దలను కలిశారు. వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసేవారన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా ముస్లింల ఆత్మగౌరవం పెంపొందేలా అనేక పదవులనిచ్చి గౌరవిస్తోందన్నారు. రాజకీయాల్లో రాణించేలా ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రజాపాలన సాగిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని అమూల్యమైన ఓటుతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, కో ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, నాయకులు చింతకుంట మధు, రఫీ, నదీమ్ అహ్మద్, కేఎం బాషా, జావీద్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ స్కూల్‌కు ఎంపిక


క్రిశాంక్


ఆయుష్మాన్ జా

అనంతపురం ఎడ్యుకేషన్: నవోదయ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో స్థానిక సంగమేష్ నగర్‌లోని రఘు సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అనంతపురం అర్బన్ విభాగం విద్యార్థులు క్రిశాంక్, ఆయుష్మాన్ జా సీట్లు దక్కించుకున్నారు. ఈ విద్యార్థులు ఇప్పటికే ఫలితాలు వెలువడిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్షల్లోనూ సత్తా చాటినట్లు స్కూల్ డైరెక్టర్ రాఘవేంద్ర తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

6న బియ్యం, బేడల వేలం

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా భక్తులు స్వామికి సమర్పించి బియ్యం, బేడలను ఈనెల 6న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

గుత్తి: పట్టణంలోని కాల్వగడ్డ ఆంజనేయ స్వామి దేవాలయం ఏరియాలో నివాసముండే బేల్దారి కరీంకు చెందిన ద్విచక్ర వాహనం అపహరణకు గురైంది. కరీం శనివారం రాత్రి పది గంటల సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రెండు హోటళ్లలో చోరీ

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో గోల్డెన్ కేఫ్(హోటల్), టీ టైమ్ హోటళ్లలో శనివారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు కేఫ్‌లలోకి ప్రవేశించి సుమారు రూ. 25 వేలు విలువైన సిగరెట్లు ఎత్తుకెళ్లారు. అంతే కాకుండా కొంత నగదు కూడా చోరీ చేశారు. ఈ ఘటనలపై బాధితులు రఫీ, బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటరామిరెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

చురుగ్గా సంగమేశ్వరుడి ఆలయ అభివృద్ధి పనులు

కూడేరు: మండల కేంద్రంలో ప్రఖ్యాతిగాంచిన స్వయంభు శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్య క్షేత్రం వద్ద ఆలయాభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. శివపార్వతులు భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పేరొందారు. తమ మొక్కులు తీరిన భక్తులు ఆలయ అభివృద్ధికి ధన,వస్తు రూపేనా సహాయం చేస్తుంటారు. ఇటీవల రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లికి చెందిన పెద్దారెడ్డి అనే భక్తుడు రూ. లక్ష విలువ చేసే రెండు ముత్యాల హారాలను శివపార్వతులకు బహూకరించారు. బళ్లారికి చెందిన బసన్న గౌడ్ అనే భక్తుడు సుమారు రూ.80 లక్షలు వ్యయంతో ఉత్తరం, దక్షిణం వైపు గాలిగోపురాలు, ఆలయ ప్రహరీ, భక్తులు కూర్చోవడానికి మంటపాలు నిర్మించేందుకు ముందుకొచ్చారు. గ్రామ పెద్దలు, గ్రామస్తులు గోపురాల నిర్మాణపు పనులకు తగు సలహా సూచనలు అందించాలని గోపురాల నిర్మాణ దాత బసన్న గౌడ్ కోరారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వసతి గదుల నిర్వహణకు నేడు వేలం

తాడిపత్రి టౌన్: మండలంలోని గంగాదేవిపల్లి సమీపంలో ఉన్న గంగాభవానీ ఆలయంలో సోమవారం వసతి గదుల నిర్వహణ కోసం వేలం నిర్వహించనున్నట్లు ఈఓ సుబ్రమణ్యం ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

కరువుపై ఎందుకు మాట్లాడరు?


మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

అనంతపురం టవర్‌క్లాక్: ఎన్నికల ప్రచారం కోసం జిల్లాకు వస్తున్న నాయకులు అనంత కరువుపై ఎందుకు మట్లాడరని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలో అత్యంత కరువు ప్రాంతం ఉమ్మడి అనంతపురం జిల్లా అన్నారు. కురువు జిల్లాకు న్యాయం చేయకపోయినప్పటికీ ఓట్లు అడగడానికి రావడం దారుణమన్నారు. మన జిల్లాకు 120 టీఎంసీల నీరు రావాల్సి ఉందన్నారు. ఈ ఎడాదిలో వర్షాలు రాక కుంటలు, చెరువులు ఎండిపోయి కరువుకాటకాలకు నిలయంగా మారిందన్నారు. కరవు ప్రాంతానికి ఏమి చేస్తారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు ఎన్‌డీఏ కూటమితో జతకటి రాష్ట్రానికి ఏమి చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త రైల్వేజోన్ ఎప్పుడు నిర్మిస్తారో చెప్పాలన్నారు. అలాగే కడప ఉక్కు కర్మాగారం, విశ్వవిద్యాలయాలను ఎప్పుడు ఏర్పాటు చేస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్ రెడ్డి, వాసు, నాగమణి, రామచరణ్ యాదవ్, శర్మాస్‌వలీ, సురేష్, కవిత, నిశాంత్‌రెడ్డి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్ సందడి

నగరంలోని పలు చర్చీల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచే ఈస్టర్ వేడుకలు జరుపుకున్నారు. క్రీస్తు పునరుత్థానం చేసిన మహోన్నత రోజు ఈస్టర్ అని మతపెద్దలు తెలిపారు. సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు చర్చీల్లో ఏసు ప్రభు కోసం భక్తిగీతాలు ఆలపించారు.

- సాక్షినెట్‌వర్క్:


బైబిల్ చదువుతున్న మహిళ


రాచానపల్లి యేసు కృప మందిరంలో ప్రార్థనలు


అరవింద నగర్‌లోని సీఎస్ఐయూ చర్చిలో ద్రాక్ష రసం తీసుకుంటున్న దృశ్యం


ఈస్టర్ వేడుకలకు హాజరైన క్రైస్తవులు


ప్రసంగిస్తున్న పాస్టర్ నాగరాజు


భక్తిగీతాలు ఆలపిస్తున్న క్రైస్తవ మహిళలు

సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలపై సమీక్ష

కూడేరు: స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన కూడేరు శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వరుడి రథోత్సవం నిర్వాహణపై ఆదివారం ఆలయ ధర్మకర్త కిష్టప్ప అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాబు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17 నుంచి 26 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేలా ఆలయ పురోహితుడు శివశంకరశాస్త్రి నిర్ణయించారు. 23న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తెలిపారు. త్వరలోనే బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అలివేలమ్మ, శ్రీనివాసులు, శంకరరెడ్డి, గ్రామ పెద్దలు తిమ్మారెడ్డి, ఓబుళప్ప, ప్రవీణ్ స్వామి, మల్లికార్జున, రమేష్, వెంకటయ్య, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థ క్షేత్రంలో ఆదివారం శింగరబట్టు, గణపతి, నారాయణస్వామికి అర్చకులు సుధీర్‌కుమార్ శర్మ, సునీల్ కుమార్‌శర్మ, బాలసుబ్రమణ్యశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బుక్కరాయసముద్రం: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమన్నారు. ఎలాంటి గొడవలకు పాల్పడరాదన్నారు. అనవసరంగా ఎవరైనా రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా చర్యలు తప్పవన్నారు.